


పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో రామారావు


కంపార్ట్‌మెంట్లలో కిక్కిరిసిన భక్తులు


పార్వతీ గంగా సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు


క్యూలైన్లలో పోటెత్తిన భక్తులు, భవానీలు


ప్రసాదాల కౌంటర్ వద్ద కిటకిట

జన జాతర

మునుపెన్నడూ లేనంతగా భవానీ భక్తుల రాక

- విజయ దశమిన పోటెత్తిన ఇంద్రకీలాద్రి
- మూలా నక్షత్రాన్ని మించి 2 లక్షల మంది వరకు దర్శనం
- శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిసారిగా కంపార్టుమెంట్ విధానం
- 38 కంపార్టుమెంట్లు నిండి రోడ్లపైకి చేరిన జనం
- వీవీఐపీ దర్శనాలు రద్దు.. అన్ని లైన్లు ఉచితం
- దర్శనానికి 7 గంటల సమయం
- రంగంలోకి ఆక్టోపస్, స్పెషల్ బలగాలు
- వరద కారణంగా నదీ విహారానికి బ్రేక్
- హంస వాహనంపై ప్రత్యేక పూజలతో సరి
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఇంకా వస్తున్న భవానీలు.. ఏర్పాట్లు కొనసాగింపు

భక్తజనసంద్రం ఇంద్రకీలాద్రికి పోటెత్తింది. భవానీ మాలధారులు వెల్లువలా కదిలివచ్చారు. మూలా నక్షత్రాన్ని మించి మునుపెన్నడూ లేనంత రద్దీ విజయ దశమికి తరలివచ్చింది. ఆలయ పరిసరాలతో పాటు క్యూలైన్లు, కనకదుర్గానగర్, ఘాట్‌రోడ్డు, కెనాల్‌రోడ్డు, వీఎంసీ కార్యాలయం వద్ద రహదారి, స్నానఘాట్లు కిక్కిరిసిపోయాయి. భక్తుల రద్దీని నియంత్రణలో ఉంచడానికి కంపార్టుమెంట్ల విధానంలో దర్శనానికి అనుమతించారు. అయినా రద్దీ పెరగడంతో పోలీసులు ఆక్టోపస్ బలగాలను రంగంలోకి దింపారు. భవానీలు నిరంతరాయంగా కదిలివస్తుండటంతో అన్ని దర్శనాలను ఉచితంగా అనుమతించారు. దీంతో దశమి రోజు దర్శనానికి 7 గంటల సమయం పట్టింది. ఉత్సవాలు ముగిసినా.. ఆదివారం కూడా రద్దీ ఏమాత్రం తగ్గకపోవడంతో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.


దుర్గాఘాట్‌లో పార్వతీ గంగా సమేత మల్లేశ్వరస్వామికి పూజలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రి జనసంద్రమైంది. సాధారణ భక్తులను మించిపోయి భవానీ మాలధారులు రావడంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ శనివారం తెల్లవారుజాము నుంచి ఆదివారం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. భవానీ దీక్షలు తీసుకున్న భక్తులు మంగళవారం, శుక్రవారం మాల విరమణ చేయరు. దీంతో శనివారం ఒక్కసారిగా పోటెత్తారు. ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా.. మొత్తం మీద 5లక్షల మంది దీక్ష తీసుకున్నట్టు గురుభవానీలు చెబుతున్నారు. వీరిలో చాలామంది శనివారమే విజయవాడకు చేరుకున్నారు. దీంతో క్యూలన్నీ ఒక్కసారిగా నిండిపోయాయి. క్యూల్లోకి వెళ్లలేమని భావించిన భక్తులు ఘాట్‌రోడ్డు ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న డివైడర్ వద్ద గుమిగూడారు. తమను ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి పంపాల్సిందేనని పోలీసులతో వాదనకు దిగారు. దీంతో విజయదశమి రోజున దర్శనానికి 7 గంటల సమయం పట్టింది. శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు భవానీలు అడ్డదారిలో కొండ ఎక్కడానికి ప్రయత్నించారు. కుమ్మరిపాలెం వైపున నిర్మిస్తున్న ఘాట్‌రోడ్డు రిటైనింగ్ వాల్ పక్క నుంచి చెట్లను పట్టుకుని కొండ ఎక్కారు. ఆదివారం మధ్యాహ్నం వరకు భక్తులు రహదారులపై నిలబడే ఉన్నారు. రాత్రి వరకు హోల్డింగ్ పాయింట్ల నుంచే క్యూల్లోకి వదిలారు.

డ్రోన్ల పర్యవేక్షణ.. ఆక్టోపస్ అదనపు బలగాలు

సాధారణంగా శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రం రోజున - మిగతా 6లో




కనకదుర్గానగర్‌లో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) సొమ్మసిల్లిన భవానీ



నేడు కంకిపాడులో పల్లె పండుగ

అభివృద్ధి పనులు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- వారం రోజుల పాటు పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల నిర్వహణ
- జిల్లాలో 2,113 ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు రూ. 169 కోట్లు మంజూరు
- రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్న ప్రభుత్వం

మచిలీపట్నం టౌన్/కంకిపాడు, అక్టోబరు 13 : గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా పల్లె పండుగ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల రూపురేఖలను మార్చనుంది. ఈ పండుగను కృష్ణాజిల్లా కంకిపాడు నుంచే ప్రారంభించనుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభంకానున్నాయి. కంకిపాడులోని టీడీపీ కార్యాలయ ఆవరణలో సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కంకిపాడులో రూ. 91 లక్షలతో నిర్మించే 11 సిమెంటు రోడ్లు, రూ. 4.15 లక్షలతో రెండు గోకులాలు, పునాదిపాడులో రూ.54 లక్షలతో రెండు సిమెంటు రోడ్ల నిర్మాణానికి పవన్‌కళ్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కంకిపాడులో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు జరపనున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల రూపురేఖలు మార్చనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టనున్న 2,113 అభివృద్ధి పనులకు రూ.169 కోట్లు మంజూరయ్యాయి. వీటితో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, శ్మశానాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాల భవనాలకు ప్రహరీలు, డ్రెయిన్లు నిర్మించనున్నారు. అలాగే రోజు వారీ పనులు చేసే కూలీలకు చెల్లింపులు చేయనున్నారు. కంకిపాడులో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖమంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొననున్నారు. కాగా, కంకిపాడులో జరిగే పల్లె పండుగ సభ ఏర్పాట్లను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా తదితరులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ.23 కోట్లు కేటాయించినట్లు వివరించారు.


కంకిపాడులో పల్లె పండుగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రభుత్వ డ్రైవర్ల సొమ్ము జల్సా!

మచిలీపట్నంలో ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ పేరుతో 12 సెంట్ల స్థలం కొనుగోలు

మచిలీపట్నంలో కోట్ల రూపాయల విలువ చేసే డ్రైవర్ల అసోసియేషన్ స్థలాన్ని కొందరు నేతలు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తమ ఇష్టానుసారంగా అద్దెలకు ఇచ్చేశారు. నెలనెలా లక్షల రూపాయల అద్దెలు వసూలు చేసి జల్సా చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రైవర్ల విశ్రాంతి తీసుకోవడం కోసం, శుభకార్యాలు నిర్వహించు కోవడానికి కొనుగోలు చేసిన స్థలం ఇప్పుడు అడుగు పెట్టడానికి కూడా వీల్లేకుండా ఉందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసోసియేషన్ సమావేశాలు, ఎన్నికలు సజావుగా సాగడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అసోసియేషన్ స్థలం నుంచి వచ్చే ఆదాయం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- విశ్రాంతి భవనం, శుభకార్యాలకు వినియోగించుకోవాలని నాడు తీర్మానం
- విలువైన స్థలంపై కొందరు అసోసియేషన్ నేతల కన్ను
- షాపులకు స్థలం అద్దెకిచ్చి ఆ నగదు జేబుల్లో వేసుకుంటున్న వైనం
- నెలకు లక్ష రూపాయలపైనే అద్దెలు వస్తున్నాయని డ్రైవర్ల ఆరోపణ



మచిలీపట్నంలోని ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో 1979లో ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల అసోసియేషన్‌గా ఏర్పడి ప్రధాన రహదారి వెంబడి టీటీడీ కల్యాణ మండలం, రైతు బజార్‌కు సమీపంలో 12 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమిలో ఒక భవనాన్ని నిర్మించారు. ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న సమయంలో వివిధ పనులపై ఇక్కడకు అధికారులను తీసుకువచ్చిన డ్రైవర్లు ఈ భవనంలో విశ్రాంతి తీసుకునేవారు. అలాగే వారి కుటుంబాల్లో శుభ, అశుభ కార్యాలకు ఈ స్థలాన్ని వాడుకోవాలని అప్పట్లో తీర్మానం చేశారు. అయితే ఈ భవనాన్ని కొంతకాలం పాటు సక్రమంగానే వినియోగించారు. సీనియర్ డ్రైవర్లు పదవీ విరమణ చేయడంతో ఈ అసోసియేషన్‌కు చెందిన స్థలాన్ని కొందరు నేతలు వివిధ రకాల షాపులకు అద్దెకు ఇచ్చేశారు. ప్రస్తుతం ఈ భవనంలో డ్రైవర్లు కనీసం కూర్చునేందుకు, సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశంలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఈ స్థలంలో మీ-సేవా కేంద్రం, ఫస్ట్ క్రై పేరుతో మరోషాపు నడుస్తున్నాయి. గతంలో కార్ల షోరూం కూడా ఉండేది. ఇటీవల కార్ల షోరూమ్‌ను ఖాళీ చేయించి స్వీట్‌షాప్‌నకు అద్దెకు ఇచ్చారు. ఈ స్వీట్‌షాప్ యజమాని అక్కడే స్వీట్లు తయారు చేసే కేంద్రం, స్వీటు షాపును కూడా ఏర్పాటు చేశాడు. కార్ల షోరూమ్‌ను ఖాళీ చేయించి స్వీట్ షాప్‌నకు అద్దెకు ఇస్తున్నట్టుగా అసోసియేషన్‌లోని సభ్యులకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ప్రభుత్వ డ్రైవర్లు అంటున్నారు.

వీఆర్వో పేరుతో లీజుకు తీసుకుని.. సబ్‌లీజుకు ఇచ్చేశారా!

మచిలీపట్నం నగర నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ డ్రైవర్స్ అసోషియేషన్‌కు చెందిన స్థలాన్ని మచిలీపట్నంలో పనిచేస్తూ, వీఆర్వోల సంఘం నాయకుడి హోదాలో ఉన్న ఒక వీఆర్వో లీజుకు తీసుకుని, వేరే వ్యక్తులకు సబ్‌లీజుకు ఇచ్చారని ప్రభుత్వ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. జిల్లాలో కీలక అధికారుల వద్ద డ్రైవర్లుగా పనిచేసే ఇద్దరు డ్రైవర్ల అసోషియేషన్ నాయకుల ముసుగులో భవనాన్ని, అందులో ఉన్న షాపులను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని నెలనెలా అద్దెను దిగమింగుతున్నారని డ్రైవర్లు మండి పడుతున్నారు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా అసోసియేషన్ సమావేశాలు నిర్వహించకుండానే వారే అసోసియేషన్ పాలకవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారని డ్రైవర్లు అంటున్నారు. ఇప్పటికైనా డ్రైవర్ల అసోసియేషన్‌కు సంబంధించిన స్థలంపై పూర్తివివరాలు వెల్లడించాలని, పాలకవర్గ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రోడ్డెక్కి ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కోస్తాతీరంలో మూడు రోజులు వర్షాలు

- వాతావరణశాఖ హెచ్చరిక

మచిలీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం కారణంగా దక్షిణ కోస్తా తీరం వెంబడి రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ఆదివారం హెచ్చరించింది. సోమవారం దక్షిణ కోస్తా తీరంలో ఏడు సెంటీమీటర్లు, 15న 12 సెంటీమీటర్లు, 16న ఏడు సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదవుతుందని స్పష్టం చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు గంటకు 35 కిలో మీటర్ల నుంచి 45 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గత రెండు రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు నమోదైనట్లు పేర్కొంది.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

6లో

లాటరీకి వేళాయె

మద్యం దుకాణాల కేటాయింపునకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలోని 123 షాపులకు 2,942 దరఖాస్తులు
- ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభం
- 8 మంది జిల్లా అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు

మచిలీపట్నం, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేయనున్న 123 మద్యం దుకాణాలను సోమవారం లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. జిల్లాలోని 123 మద్యం షాపులకు 2,942 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం ఎనిమిది గంటలకు మచిలీపట్నం హిందూ కళాశాలలోని ఎంబీఏ బ్లాక్‌లో మద్యం దుకాణాలకు సంబంధించిన లాటరీ ప్రక్రియ ఎనిమిది కౌంటర్ల ద్వారా ప్రారంభమవుతుంది. వీటి పర్యవేక్షణకు ఎనిమిది మంది అధికారులను నియమిస్తూ కలెక్టర్ బాలాజీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం ఎక్సైజ్‌స్టేషన్ కౌంటర్-1 పరిశీలకుడిగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం. ఫణిదూర్జటి, బంటుమిల్లి ఎక్సైజ్‌స్టేషన్ కౌంటర్-2కు జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, అవనిగడ్డ ఎక్సైజ్‌స్టేషన్ కౌంటర్-3కి డీఎస్‌వో పార్వతి, మొవ్వ ఎక్సైజ్ స్టేషన్ కౌంటర్-4కు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ బి.మురళీకిషోర్, గుడివాడ ఎక్సైజ్‌స్టేషన్ కౌంటర్-5కు మార్కెటింగ్ ఏడీ ఎల్.నిత్యానందం, నందివాడ ఎక్సైజ్‌స్టేషన్ కౌంటర్-6కు వయోజన విద్య విభాగం ఏడీ బేగ్, ఉయ్యూరు ఎక్సైజ్‌స్టేషన్ కౌంటర్-7కు మెప్మా పీడీ వెంకట నారాయణ, గన్నవరం ఎక్సైజ్‌స్టేషన్ కౌంటర్-8కు సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాహిద్‌బాబు నియమితులయ్యారు. వీరి పర్యవేక్షణలో లాటరీ తీసి మద్యం షాపులను సదరు దరఖాస్తుదారులకు కేటాయించనున్నారు.



దీక్ష విరమించేందుకు కాలినడకన వస్తున్న భవానీ మాలధారి



కృష్ణవేణి ఘాట్ ప్రాంతంలో..



పీఎంసీ రోడ్డులో..



కీలాద్రి.. కిటకిట

దీక్షల విరమణకు పోటెత్తిన భవానీలు • కిక్కిరిసిపోయిన దుర్గగుడి పరిసరాలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో దీక్షల విరమణ కోసం భక్తులు శని, ఆదివారాల్లో ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. దీంతో దుర్గగుడి పరిసరాలు కిటకిటలాడాయి.



దీక్షలు విరమిస్తున్న భవానీలు

దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలపై ఉండాలి: సురేఖ

వన్‌టౌన్: దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదల సురేఖ తెలిపారు. శనివారం ఇంద్రకీలాద్రిపై రాజరాజేశ్వరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను కుటుంబసభ్యులతో కలిసి ఆమె దర్శించుకున్నారు. దుర్గమ్మను నటుడు పృథ్వీ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆదివారం నెల్లూరుకు చెందిన వ్యాపారవేత్త పంకజ్‌రెడ్డి, సరిత దంపతులు రూ.10 లక్షల విలువైన బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. ఈవో రామారావును ద్వారా హారాన్ని దేవస్థానానికి అందజేశారు.

అలరించిన కళారూపాలు

పున్నమీఘాట్ ప్రాంతంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న నారీశక్తి విజయోత్సవాలు రెండో రోజు కార్యక్రమానికి మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. శనివారం విజయదశమి సందర్భంగా మహిళల రాక, వివిధ కళారూపాల ప్రదర్శనతో కృష్ణా తీరం ప్రత్యేక శోభను సంతరించుకుంది. గిరిజన సంప్రదాయ కొమ్ము నృత్యం మహిళలను అలరించింది. తెలంగాణ సంప్రదాయమైన పోతురాజు వేషధారణలో విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



గిరిజనుల సంప్రదాయ నృత్యప్రదర్శన

మహర్నవమి రోజున రూ.84.02 లక్షల ఆదాయం

వన్‌టౌన్, అక్టోబరు 13: ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు శుక్రవారం(మహర్నవమి)తో ముగిశాయి. శుక్రవారం మహిషాసురమర్దినీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. ఆరోజున కనకదుర్గమ్మ దేవస్థానానికి రూ.84,02,775 ఆదాయం సమకూరింది. 4,149 మంది భక్తులు రూ.500 టికెట్లు కొనుగోలు చేయగా రూ.20,74,500, 1,847 మంది రూ.300 టికెట్లు కొనుగోలు చేయగా రూ.5,54, 100, రూ.100 టికెట్‌తో 4,686 మంది దర్శించుకోగా రూ.46, 86,000 సమకూరింది. 26,584 లడ్డూలను విక్రయించగా, రూ.3,98,760, రూ.100 చొప్పున ఆరు లడ్డూలున్న ప్యాకింగ్ లను విక్రయించగా రూ.44,06,600 సమకూరింది. మొత్తం 2,64,396 లడ్డూలను విక్రయించారు. పరోక్ష ప్రత్యేక కుంకు మార్చన రూ.3000 టికెట్లను 18 మంది కొనుగోలు చేయగా రూ.54వేలు, పరోక్ష ప్రత్యేక చండీహోమానికి రూ.4వేల టికెట్లను ఏడుగురు కొనుగోలు చేయగా రూ.28వేలు, శ్రీచక్ర నవావరణార్చన కోసం రూ.3,000 టికెట్‌ను ఇద్దరు కొనుగోలు చేయగా రూ.6వేలు ఆదాయం వచ్చింది. పబ్లికేషన్లు, ఫొటో లు, క్యాలెండర్ల ద్వారా రూ.10,230, ఇతరత్రా ఆదాయం రూ.20, 545, రూ.40 టికెట్ ద్వారా 9,536 మంది తలనీలాలు సమర్పించగా రూ.3,81,440 ఆదాయం సమకూరింది.



దుర్గామల్లేశ్వరస్వామి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు



చిరంజీవి సతీమణి సురేఖకు వేద ఆశీర్వచనం



నటుడు పృథ్వీరాజ్ కుటుంబసభ్యులు

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ట్రాఫిక్ పోలీస్ అధికారి

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఓ చిన్నారి తల్లిదండ్రుల నుంచి తప్పిపోయాడు. బందోబస్తు నిర్వర్తిస్తున్న పోలీసులు ఆ చిన్నారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. కోనసీమ జిల్లా యానాం ప్రాంతానికి చెందిన విష్ణు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. శనీశ్వరుడి ఆలయం వద్ద ఘాట్‌లో స్నానం చేసి దుస్తులు మార్చుకోవడానికి తల్లిదండ్రులు వెళ్లారు. వారి రెండున్నరేళ్ల బాలుడిని మెట్ల వద్ద కూర్చోబెట్టారు. వారు దుస్తులు మార్చుకుని వచ్చేసరికి బాబు కనిపించలేదు. బాబును అక్కడ కూర్చోబెట్టిన విషయం తల్లిదండ్రులు మరిచిపోయారు. బ్యాగుల్లో దుస్తులు సర్దుకుని దర్శనానికి వెళ్లిపోయారు. బాబు అక్కడ రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతుండగా ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐ సూర్యభాస్కరరావు, తోటి సిబ్బంది గుర్తించారు. బాబుకు ఎదుటి వ్యక్తుల మాటలు వినిపించడం లేదు. మాట్లాడలేకపోతున్నాడు. దీంతో పోలీసులు మైకుల్లో బాబు తప్పిపోయాడని ప్రకటన చేయించారు. ఈ ప్రకటన విన్న విష్ణు కుటుంబసభ్యులు బాబు తమతో లేకపోవడంతో వెంటనే వచ్చి పోలీసుల వద్ద నుంచి బాబును తీసుకున్నారు.



మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

చంద్రబాబు స్ఫూర్తితో సంక్షోభాన్ని అధిగమించాం

- బుడమేరు వరదతో 40 రోజులు మిల్క్ ఫ్యాక్టరీ మూత
- ఆరు దశాబ్దాల చరిత్రలో ఇదే అతిపెద్ద సంక్షోభం
- యూనియన్‌ను ఆదుకునేందుకు సీఎం చేయూత
- మిల్క్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంలో చలసాని ఆంజనేయులు

'ఆరు దశాబ్దాల చరిత్రలో కృష్ణా మిల్క్ యూనియన్‌కు బుడమేరు వరద రూపంలో అతి పెద్ద సంక్షోభం ఎదురైంది. సంక్షోభాలను అధిగమించడంలో సీఎం చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకున్నాం. 40 రోజుల్లో ఫ్యాక్టరీని మళ్లీ గాడిలో పెట్టి పునఃప్రారంభించుకుంటున్నాం. యూనియన్‌ను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేయగానే స్పందించారు. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌డీడీబీకి ఆర్థికసాయం చేయాల్సిందిగా సిఫారసు చేశారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.' అని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు.

చిట్టినగర్, అక్టోబరు 13: చిట్టినగర్‌లోని కృష్ణా మిల్క్ యూనియన్ ఫ్యాక్టరీ కార్యకలాపాలను శనివారం విజయదశమి సందర్భంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడారు. 'బుడమేరు వరదలతో తీవ్రంగా నష్టపోయినప్పటికీ తిరిగి అతి తక్కువ కాలంలో ఫ్యాక్టరీని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది. వరద ముంపుతో ఫ్యాక్టరీ కార్యకలాపాలు 40 రోజులపాటు నిలిచిపోయినా, ముందు చూపుతో నిర్మించిన ప్రాజెక్ట్ కామధేను వీరవల్లి ఫ్యాక్టరీ కష్టకాలంలో సంజీవనిలా ఆదుకుంది. పాడి రైతులు, వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా యూనియన్ కృషి చేసింది. మిషనరీ అంతా వరదలో మునిగిపోయినా అధికారులు, సిబ్బంది సంఘటితంగా పనిచేశారు. త్వరగా ఫ్యాక్టరీ ప్రారంభించేలా చేశారు. విపత్తులో యూనియన్‌కు అండగా నిలిచిన పాడి రైతులు, సంఘాల అధ్యక్షులకు కృతజ్ఞతలు'. అని చైర్మన్ తెలిపారు. '42 రోజుల తర్వాత ఫ్యాక్టరీలో అన్ని కార్యకలాపాలు యథావిధిగా కొనసాగిస్తున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బోనస్‌గా రూ.50 కోట్లు చెల్లించాం. వార్షిక టర్నోవర్ రూ.1200 కోట్లకు చేరింది. పన్నులకు ముందు వార్షిక లాభాలు రూ.41 కోట్లకు పెరిగాయి. యూనియన్ నికర విలువ రూ.95.50 కోట్ల నుంచి రూ.205.65 కోట్లకు పెరిగింది. క్షీరబంధు పథకం కింద ఇప్పటివరకు చనిపోయిన 3000 మంది పాడి రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు అందించాం.' అని ఎండీ కొల్లి ఈశ్వరబాబు తెలిపారు. పాలకవర్గసభ్యులు వేమూరి సాయి వెంకట రమణ, కొండలరావు, ఎ.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కడ నష్టాలు.. ఇక్కడ లాభాలు

2017-18లో కృష్ణా మిల్క్ యూనియన్ వార్షిక టర్నోవర్ రూ.662 కోట్లు. 2023-24 నాటికి ఇది రూ.1200 కోట్లకు చేరింది. ప్రస్తుతం యూనియన్ రూ.40 కోట్ల లాభాన్ని నమోదు చేయడంతోపాటు రూ.50 కోట్లను బోనస్ రూపంలో రైతులకు అందించగలిగింది. మరో రూ.15 కోట్లను రైతుల సంక్షేమానికి వినియోగించింది. మరోవైపు రూ.1750 కోట్ల టర్నోవర్ ఉన్న విశాఖ డెయిరీ నష్టాలను నమోదు చేయడం గమనార్హం. కృష్ణా మిల్క్ యూనియన్ సహకార రంగంలో ఉండటం, సమర్థనాయకత్వం తోడవడంతో దినదినాభివృద్ధి చెందుతోంది.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

మచిలీపట్నం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్ష రాసే ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణ పొందేందుకు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ షాహిద్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉచిత శిక్షణ పొందడం కోసం జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. ఈనెల 27న అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అర్హులైనవారిని ఎంపికచేసి, శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు.

రద్దీగా పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్

- పండగకొచ్చి తిరిగి వెళ్తున్న వారితో కిటకిట
- ప్రయాణికుల కోసం 59 స్పెషల్ బస్సులు, 16 ప్రత్యేక రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పండగ సెలవులు ఆదివారంతో ముగియడంతో సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు పయనమయ్యారు. దీంతో పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడిపోయాయి. ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు 32, ఇతర ప్రాంతాలకు 23, చెన్నైకు 2, విశాఖకు 2 స్పెషల్ సర్వీసులను నడిపారు. మొత్తం 59 స్పెషల్ బస్సులను నడిపారు. రెగ్యులర్ షెడ్యూల్డ్ బస్సులు పూర్తిగా కిటకిటలాడిపోయాయి. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రయాణించారు. ఇక్కడి నుంచి వెళ్లే వారితో పాటు సోమవారం నుంచి కళాశాలలు ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకూ పెద్ద సంఖ్యలో వచ్చారు. రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు పెద్ద సంఖ్యలో ప్రయాణించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు భారీగా రాకపోకలు సాగాయి. రద్దీని పురస్కరించుకుని రైల్వే అధికారులు 16 స్పెషల్ రైళ్లను నడుపుతున్నారు. శనివారం చెన్నైలో జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో రైళ్లు రద్దయ్యాయి. ఆదివారానికి పునరుద్ధరించటంతో రైళ్లన్నీ కిటకిటలాడుతూ వెళ్లాయి.



రైలు కోసం ప్లాట్‌ఫాంపై ప్రయాణికుల పడిగాపులు



నుజ్జయిన కారు



కారును ఢీకొన్న టిప్పర్

టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తుకు టీడీపీ నేత బలి

- అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టి..అవతలి వైపున ప్రయాణిస్తున్న కారును ఢీకొన్న టిప్పర్
- చెవిటికల్లు మాజీ సర్పంచ్ దుర్మరణం



మృతిచెందిన కోగంటి విష్ణువర్ధనరావు(ఫైల్)

నందిగామరూరల్/కంచికచర్లరూరల్, అక్టోబరు 13: టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తు ఒక నిండు ప్రాణాన్ని బలికొంది. తన దారిన తాను కారులో వెళుతున్న టీడీపీ నేతను అతివేగంగా వచ్చిన టిప్పర్ డివైడర్‌ను దాటి వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న టీడీపీ నాయకుడు, కంచికచర్ల మండలం చెవిటికల్లు మాజీ సర్పంచ్ కోగంటి విష్ణువర్ధనరావు అక్కడికక్కడే మరణించారు. కోగంటి విష్ణువర్ధనరావు విజయవాడలో ఉంటున్నారు. గతంలో తన ఇంట్లో పనిచేసిన వ్యక్తి మనుమరాలి వివాహానికి ఆదివారం ఉదయం చందర్లపాడు మండలం తోటరావులపాడుకు కారులో వస్తున్నారు. నందిగామ మండలం ఐతవరం శివారులో నందిగామ నుంచి విజయవాడ వెళుతున్న టిప్పర్ డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు అవతలి వైపున ప్రయాణిస్తున్న విష్ణువర్ధనరావు కారుపై పడింది. కారు నుజ్జు నుజ్జైంది. కారులో ఉన్న విష్ణువర్ధనరావును నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు సీఐ ఎస్‌వీఎల్ నాయుడు తెలిపారు. మార్చురీ వద్ద భౌతికకాయానికి మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, వసంత నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. భౌతికకాయాన్ని కంచికచర్ల పరిసర గ్రామాల ప్రజలు సందర్శించి నివాళులర్పించారు.

ఉద్యమాలతోనే కార్మిక సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13: ఉద్యమాల ద్వారానే కార్మికుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ భవనంలో ఆదివారం నిర్వహించిన ఎల్ఐసీఈ ఉద్యోగుల సంఘ నాయకుడు చంద్రపాల్ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై చంద్రపాల్ పోరాడుతున్నారన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకులు జి.సుధాకర్ బాబు, జి.తిరుపతయ్య, జి.కిషోర్‌కుమార్, సీఐటీయూనేతలు వెంకటేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

జన జాతర

(ఐదో పేజీ తరువాయి)

మాత్రమే హోల్డింగ్ పాయింట్లను ఉపయోగిస్తారు. ఈ పాయింట్లలో ఉన్న ఒక్కో కంపార్ట్‌మెంట్‌లోని భక్తులను క్యూల్లోకి పంపుతారు. ఈ ఏడాది మూలా నక్షత్రం రోజున లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు 38 హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇంద్రకీలాద్రి చరిత్రలో హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించడం ఇదే మొదటిసారి. మూలా నక్షత్రం రోజు అంతగా హోల్డింగ్ పాయింట్ల అవసరం రాకున్నా.. విజయదశమి నాడు మాత్రం వీటిని ఉపయోగించాల్సి వచ్చింది. మోడల్ గెస్ట్‌హౌస్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించారు. వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి పోలీసు శాఖ వద్ద ఉన్న ఐదు డ్రోన్లను ఉపయోగించారు. అవి సరిపోకపోవడంతో అదనంగా మరో ఏడు తెప్పించారు. కీలక ప్రాంతాలను డ్రోన్లతో పరిశీలించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని సెక్టార్ల ఇన్‌చార్జులకు ఆదేశాలిచ్చి రహదారులపై ఉన్న భక్తులను హోల్డింగ్ పాయింట్లలోకి పంపేలా ఏర్పాటు చేశారు. 38 కంపార్టుమెంట్లు నిండిపోవడంతో వీఎంసీ రోడ్డు, పూలమార్కెట్, పీసీఆర్ ఫ్లైఓవర్, ఫ్లైఓవర్ కింద ఉన్న ప్రాంతాల్లో రోప్‌లతో తాత్కాలిక కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. డీజీపీ ద్వారకాతిరుమలరావు, ఇంటెలిజెన్స్ డీజీ లడ్డాకు పోలీసు కమిషనర్ పరిస్థితిని వివరించడంతో ఆక్టోపస్, బెటాలియన్లలో సిబ్బందిని రంగంలోకి దింపారు. శరన్నవరాత్రుల్లో ఆక్టోపస్ బందోబస్తుకు వినియోగించడం ఇదే ప్రథమం.

అన్ని క్యూలు ఉచితం

భక్తుల రద్దీ నేపథ్యంలో కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు దేవదాయ శాఖ అధికారులతో చర్చించారు. క్యూల్లో టికెట్లు విక్రయిస్తే ఇబ్బందులు వస్తాయని వివరించారు. దీంతో ఆలయ అధికారులు అన్ని క్యూల నుంచి భక్తులను ఉచితంగా దర్శనానికి అనుమతించారు. శనివారం ఉదయం నుంచి అన్ని వీవీఐపీ, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. అప్పటికే విక్రయించిన వీఐపీ దర్శన టికెట్లను రద్దు చేశారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న పరిస్థితిని వీవీఐపీలకు తెలియజేసి దర్శనాలకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. రద్దీ నేపథ్యంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖర బాబు దంపతులు ముఖమండపం నుంచే దర్శనం చేసుకున్నారు. టోల్‌గేట్ ముందున్న రహదారిపై భక్తులు భారీగా గూమి గూడటంతో తొక్కిసలాటకు అవకాశముంటుందని పోలీసులు వారిని కొండపైకి పంపారు.

నదీ విహారానికి బ్రేక్

విజయదశమి రోజున కృష్ణానదిలో నిర్వహించే తెప్పోత్సవంలో నదీ విహారానికి బ్రేక్ పడింది. దుర్గాఘాట్ వద్ద హంస వాహనంపై శ్రీపార్వతీ గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. ప్రకాశం బ్యారేజీకి ప్రస్తుతం 41,464 క్యూసెక్కుల నీరు రావడం వల్ల నదీ విహారాన్ని రద్దు చేశారు. దుర్గాఘాట్ వద్దే మూడు సార్లు హంస వాహనాన్ని వెనక్కి, ముందుకు కదిలించారు. పూజల అనంతరం ఉత్సవమూర్తులను పోలీసులకు అప్పగించారు. పోలీసులు పల్లకీలో ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ శమీవృక్షం వద్ద పూజలు చేశాక ఊరేగింపుగా తీసుకెళ్లి ఆదివారం తెల్లవారుజామున ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, యాగశాలలో పూర్ణాహుతి జరిగింది. దీంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

ఈతకు వెళ్లి.. సీఏ విద్యార్థి గల్లంతు



రేపల్లె రాజ్ (ఫైల్)

వన్‌టౌన్, అక్టోబరు 13: స్వర్గపురి ఘాట్ సమీపంలో కృష్ణా నదిలో ఈతకు ఆదివారం వెళ్లిన ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు గల్లంతయ్యారు. కృష్ణలంక పైడయ్య వీధిలోని ఓ ప్రైవేట్ బాలుర హాస్టల్‌లో ఉం టూ సీఏ చదువుతున్న అవనిగడ్డ సమీపంలోని కొత్తపాలేనికి చెందిన రేపల్లె రాజ్ (20), ప్రకాశం జిల్లా మేదరమెట్లకు చెందిన పోతినేని కేశవ(21) నెల్లూరుకు చెందిన లెక్కల విష్ణు వర్ధన్(21) ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో కృష్ణానదిలో సరదాగా స్నానానికి దిగారు. రేపల్లె రాజ్ నదిలో గల్లంతవ్వగా కేశవ, విష్ణు వర్ధన్ బయటకు వచ్చారు. కృష్ణలంక పోలీసులు రేపల్లె రాజ్ ఆచూకీ కోసం నదిలో గాలింపు ప్రారంభించారు. పొద్దు పోయేంతవరకు వెదికినా ఆచూకీ తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

ఘనంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 13 : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం పురస్కరించుకొని ఆదివారం స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీనివాసుని కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు కల్యాణాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే విధంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని బాబు, అరుణ దంపతులు కల్యాణోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవంలో ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తోటలు విడిచి.. పేటల్లోకి..

- బాపులపాడు మండలంలో జనావాసాల్లోకి కోతుల గుంపు
- ఇళ్లలోకి చొరబడి చిందరవందర చేస్తున్న వస్తువులు
- ఒంటరిగా ఉన్న వ్యక్తులపై దాడికి యత్నం
- పట్టించుకోని పంచాయతీలు
- భయపడుతున్న స్థానికులు



నూజివీడు రైల్వే స్టేషన్ గూడ్స్ ట్రాక్ వద్ద కోతుల గుంపు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 13 : అడవుల్లో ఉండే కోతులు జనవాసాల్లోకి వచ్చి ప్రజానీకాన్ని ఇబ్బంది పెడుతున్నాయి. ఆహారం కోసం గ్రామాలను పట్టుకొని వేధిస్తున్నాయి. ఇళ్లల్లో ఉండే కొబ్బరి చెట్లు పైకి ఎక్కి నాశనం చేస్తున్నాయి. ఇళ్ళలోకి దూరి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. నూజివీడు డివిజన్‌లో ఎక్కువగా అటవీ ప్రాంతం ఉండేది. ఆ ప్రాంతంలో కోతులు, కొండముచ్చులు ఎక్కువగా సంచరించేవి. మామిడి, జామ, సపోట ఇతర పండ్ల తోటలు కూడా జాస్తిగా ఉండేవి. పండ్ల తోటల్లో తిరుగుతూ పంటను నాశనం చేస్తుండేవి. పండ్ల తోటలు పెంచే రైతులు కోతులు బాధ భరిం చలేక వాటి బెడద తగ్గించుకోవడానికి రైతులు కొండముచ్చులను పెంచడం ఆరంభించారు. వేలాది రూపాయలు వెచ్చించి కొండ ముచ్చును తోటల్లో కట్టి కోతులను బెదిరించే వారు. కాలక్రమేణా మామిడి, జామ, బొప్పాయి. సపోట తదితర పంటలు గిట్టుబాటు కాకపోవడంతో అధిక దిగుబడి ఆదాయాన్ని ఇచ్చే పంటలు వైపు మళ్లారు. దీంతో ఆహారం దొరక్క గ్రామాలు మీద పడుతున్నాయి. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల మీద పడి ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఒంటరిగా ఉన్న వ్యక్తులపై దాడు లకు దిగుతున్నాయి. కోతుల బారి నుంచి కాపా డుకోవడానికి ప్రజలు నిద్రాహారాలు మానాల్సి వస్తుంది. ఇంట్లో వస్తువుల్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. కోతులు ఇంటి ఛాయలకు రాకుండా పడిగాపులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడదతో పాటు కోతుల బెడద కూడా ఎదురైంది. తరిమి కొడితే పక్క గ్రామంలోకి వెళ్లి పడుతున్నాయి. శనివారం బాపుల పాడు గ్రామంలో రైల్వే స్టేషన్ సమీపంలోని నివాసాల్లోకి గుంపులుగా ఎగబడ్డాయి. ప్రజానీకం తరిమి కొట్టడంతో నూజివీడు స్టేషన్‌లో గూడ్స్ వ్యా గిన్ ట్రాక్ మీద, ఎఫ్‌సీఐ గోదాములు వద్ద సంచరిస్తున్నాయి. మళ్లీ గ్రామంలోకి ఎప్పుడు వచ్చి మీద పడతాయోనన్న భయం ప్రజలను పట్టుకుంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కోతులను పట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

పాతపాడులో దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కలపాల అబ్రహాం, తదితరులు

విజయవాడ రూరల్, అక్టోబరు 13 : దసరా పండుగను పురస్కరించుకుని పాతపాడు గ్రామంలో పారిశుధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక వ్యాపారి కలపాల అబ్రహాం పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించే ఇరవై మంది కార్మికులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలపాల కార్తిక్, కౌశిక్, జాలాది గాంధీ పాల్గొన్నారు.

శవదహన యంత్రాలు అందజేత



శ్మశానవాటిక నిర్వాహకులకు శవదహన యంత్రాలను అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పెనమలూరు, అక్టోబరు 13 : గ్యాస్‌తో పనిచేసే శవ దహన యంత్రాలను విజయవాడ రోటరీ క్లబ్ తరఫున పోరంకి, పెనమలూరు, కానూరు శ్మశాన వాటికలకు ఆదివారం అందించారు. ఒక్కొక్క యంత్రం ఖరీదు సుమారు రూ. 10 లక్షలపైన ఉంటుందని రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ తరఫున గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పట్టాభి రామారావు, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, పెనమలూరు సర్పంచ్ లింగాల భాస్కరరావు, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు

గండిగుంట(ఉయ్యూరు), అక్టోబరు 13 : గండిగుంట బైపాస్ రోడ్డు షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం ఏకాదశి, బాబా 106 సమాధి దినోత్సవం పురస్కరించుకుని బాబాకు ప్రత్యేక పూజలు, సమాధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉద యం కాగడ హారతి, పంచామృత అభిషేకం, బాబా సమాధి అలంకారం నిర్వహించారు. గులాబీలు, చామంతి పూలతో బాబాకు అలంకారం చేశారు. మామిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాబా సమాధి కార్యక్రమం, భక్తులకు అన్న సమారాధన చేశారు. విజయవాడకు చెందిన కొల్లిపర పవన్‌కుమార్ భక్త బృందం భజనా కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులతో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తేజ, ప్రసాద్

ఉయ్యూరు, అక్టోబరు 13 : జగదాంబసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న దేవీశరన్నవరాత్రులు పురస్కరించుకుని ఆర్‌జె అండ్ గాయత్రి డ్యాన్స్ అకాడమి చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. మహిషాసురమర్దని నృత్య రూపకంతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నా పెద్ద తేడాలేకుండా అందరిని ఆకట్టుకున్నాయి. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, నూకల సాంబశివరావు, జోన్ ఛైర్‌పర్సన్ ఇస్మాయిల్, దినవహి ప్రసాద్ సర్టిఫికెట్లు అందజేశారు.

మాజీ ఎంపీపీ ఝాన్సీకి మాతృవియోగం

గన్నవరం, అక్టోబరు 13 : గన్నవరం మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీ తల్లి సరోజిని మృతి చెందారు. స్థానిక కొత్తపేటలో ఉంటున్న ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు సరోజిని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వృద్ధుల విశ్రాంతి మందిరం ప్రారంభం



కొయ్యగూరపాడులో వృద్ధుల విశ్రాంతి మందిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి

ఉంగుటూరు, అక్టోబరు 13 : మండలంలోని కొయ్యగూరపాడులో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచ్, కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు పాతూరు కుటుంబ సాంబశివరావు జ్ఞాపకార్థం కుమారుడు పాతూరు రాంబాబు, మనుమడు డాక్టర్ రత్నాకర్‌లు రూ. 4లక్షలతో నిర్మించిన వయోవృద్ధుల విశ్రాంతి మందిరం (సీనియర్ సిటిజన్ రెస్ట్‌హోమ్)ను శనివారం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొరివి మాధవి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షులు కొరివి పార్థసారధి, ఎంపీటీసీ దాసరి బాపినీడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ప్యానల్స్‌పై అవగాహన సదస్సు నేడు

ఉయ్యూరు, అక్టోబరు 13 : పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంలో భాగంగా గృహ అవసరాలకు సౌర విద్యుత్ ప్యానల్స్ అమర్చుకొ నుటద్వారా కలిగే ప్రయోజనాలపై సోమవారం సాయంత్రం కేసీపీ ఆడిటోరి యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఏపీసీపీ డీసీఎల్ ఉయ్యూరు ఈఈ డి. కృష్ణనాయక్ తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వ ఇచ్చే సబ్సిడీపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

మోడల్ గ్రామంగా గొల్లగూడెం

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను అభినందించిన పంచాయతీ రాజ్ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ మున్సిపల్ కమిషనర్ కృష్ణతేజ



గొల్లగూడెంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని పంచాయతీరాజ్ కమిషనర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గొల్లగూడెం (కంకిపాడు), అక్టోబరు 13 : నియోజకవర్గంలోనే మోడల్ గ్రామంగా గొల్లగూడెం గ్రామాన్ని తీర్చిదిద్దిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను పంచాయతీ రాజ్ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ మున్సిపల్ కమిషరర్ కృష్ణతేజ అభినందించారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో 2014 - 19 మధ్య టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని కమిషనర్ కృష్ణతేజకు ఆదివారం ఆయన వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణతేజ మాట్లాడుతూ, ఓ చిన్న గ్రామాన్ని రూ. 3 కోట్లతో అభివృద్ధి చేసి మోడల్ గ్రామంగా తీర్చదిద్దడం అభినందనీయమన్నారు. ప్రజలకు ప్రధానంగా అవసరమైన పక్కా రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తే గ్రామం 75 శాతం అభివృద్ధి చెందినట్లే అన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో గొల్లగూడెం గ్రామ ప్రజలు తనను ఆదరించలేదని, అయినా గ్రామాభివృద్ధిలో ఎక్కడా రాజీ పడలేదని తెలియజేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఈ ఐదేళ్లలో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆపన్నహస్తం

పెనమలూరు : షుగరు మహమ్మారితో తన కుడికాలును పోగొట్టుకుని దివ్యాంగునిగా మారిన ఒక నిరుపేదకు తిరిగి నడిచేందుకు కృత్రిమ కాలును ఏర్పాటు చేసి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. కానూరులో గత ఎన్నికల ప్రచార సమయంలో ప్రచారం నిర్వహిస్తుండగా ఆ గ్రామానికి చెందిన సర్నాల సుబ్బారావు షుగరు వ్యాధితో తన కుడి కాలును పోగొట్టుకున్నట్లు బోడె ప్రసాద్ తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో తాను తప్పనిసరిగా కృత్రిమ కాలును ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎన్నికల్లో గెలిచిన తర్వాత హామీని నిలబెట్టుకునే పనిలో భాగంగా విజయవాడ కృత్రిమ కాళ్ల కంపెనీ వారిని సంప్రదించి సుబ్బారావుకు ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో కృత్రిమ కాలును ఏర్పాటు చేశారు. సుబ్బారావు, అతని కుటుంబసభ్యులు ఎమ్మెల్యే బోడెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్, టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మాదు రామకృష్ణ, కరిమికొండ సురేష్, అంగిరేకుల మురళి, కొమ్మినేని వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

భవానీలకు సేవ అభినందనీయం

జనసేన నేత గరికపాటి శివశంకర్



గన్నవరం, అక్టోబరు 13 : భవానీలకు సేవ చేయటం అభినందనీయమని జనసేన పార్టీ రాష్ట్ర ఎలక్షన్ మీడియా కో-ఆర్డినేటర్ గరికపాటి శివ శంకర్ అన్నారు. స్థానిక గాంధీ బొమ్మసెంటర్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ కాలినడకన వెళ్లే భవానీలకు ఫ్రూట్స్, బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్, డ్రింక్ కిట్‌లను పంపిణీ చేశారు. జనసేన నాయకులు పచ్చిపాల లక్ష్మణరావు, కోలవెన్ను నరసింహారావు(నాని), షేక్ సిరాజ్, షేక్ నాగూర్, ప్రవీణ్, ఖలీల్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 13 : ప్రజలు సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అన్నారు. బొమ్ములూరు కోదండరామాలయంలో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుట్టా రవిశంకర్, కొల్లి చందు, వేగే కృష్ణారావు, సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, చిన్నా, దుట్టా శివన్నారాయణ, అన్నం సత్యనారాయణ, నిలీష్‌కుమార్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



పాత గన్నవరం తిరుపతమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పూజలు

గన్నవరం, అక్టోబరు 13 : అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, దొంతు చిన్న, గూడపాటి తులసీ మోహన్, కాసన్నేని రంగబాబు, జాస్తి ఫణిశేఖర్ దేవినేని సులోచన, మోదుగుమూడి వేణు, యనమదల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

●సావరగూడెం రామాలయంలో రిటైర్డ్ అధ్యాపకుడు మద్దుకూరి విజయకుమార్ కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభంపై ఇత్తడి తొడుగును ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. కడియాల సీతారాం ప్రసాద్, పసుమర్తి రామయ్య, నాగేశ్వరరావు, చీమలదండు రామకృష్ణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

● అల్లాపురం శ్రీదుర్గా భవాని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో పోటీలు నిర్వహించి శనివారం సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్నబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉప సర్పంచ్ ఆవుటపల్లి శివ ప్రసాద్, విమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్ : విజయదశమి సందర్భంగా పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులో శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా వేలాది మందికి అన్నసంతర్పణ చేశారు. జనసేన పట్టణ కమిటీ అధ్యక్షుడు అహమ్మద్ ఆధ్వర్యంలో ముస్లింల తరపున స్థానిక విజయవాడ రోడ్డులో కాలినడకన విజయవాడ కనకదుర్గ అమ్మవారి సన్నిధికి వెళ్లే భవాని భక్తులకు పండ్లు ఫలహారాలు అందించారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల వ్యాప్తంగా గ్రామాల్లో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిసాయి. కొత్తపల్లి, బొమ్ములూరు, రంగన్నగూడెం, వీరవల్లి, మల్లవల్లి, రంగయ్యప్పారావుపేట, తదితర గ్రామాల్లో 9రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన దసరా వేడుకలు శనివారంతో ముగియగా ఆదివారం భక్తులకు, గ్రామస్తులకు భారీ అన్నప్ర సాద వితరణ నిర్వహించారు. రంగన్నగూడెంలో నిర్వహించిన మెగా అన్నప్రసాద వితరణలో ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ రంగామణి, వెనిగళ్ల జ్ఞానశేఖర్, తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు : మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. లంకపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఆత్కూరు శ్రీకనకదుర్గ ఆలయం, శ్రీలలితాపరమేశ్వరి ఆలయంలో 10వ రోజైన శనివారం విజయదశమి పర్వదినం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చివరి రోజు అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని కుంకుమపూజలు జరిపారు. లంకపల్లిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత శోభాయాత్ర ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. తొలుత మహిళలు ఆలయప్రాంగణంలోని జమ్మిచెట్టుకు ప్రత్యేకపూజలు జరిపారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు : ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. ఉత్సవాల్లో చివరి రోజైన శనివారం జగదాంబ అమ్మవారిని శ్రీరాజ రాజేశ్వరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా సాయంత్రం జమ్మి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గండి గుంట దత్త ఆశ్రమంలో నవరాత్రుల చివరి రోజున అమ్మవారికి విశేషపూజలు చేశారు. జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించిన ఆలయ అర్చకుడు సోమేశ్వరరావును ఉయ్యూరు మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు ఆధ్వ ర్యంలో ఘనంగా సత్కరించారు.



ఉంగుటూరులో రేషన్ కోసం బారులు తీరిన కార్డుదారులు

ఎట్టకేలకు రేషన్ పంపిణీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఉంగుటూరు, అక్టోబరు 13 : ఉంగుటూరులో పీడీఎస్, రెవెన్యూ యంత్రాంగం ఎట్టకేలకు కదలింది. దసరా పండుగ(శనివారం) రోజున హడావుడిగా రేషన్ అందించేందుకు చర్యలు చేపట్టింది. స్థానిక షాప్‌నెం-8లో ప్రజాపంపిణీ వ్యవస్థద్వారా సుమారు 650 కార్డుదారులకు ప్రతినెలా 1 నుంచి 17వ తేదీలోపు నిత్యావసర సరుకులు అందించాల్సివుండగా, పాత, కొత్త డీలర్ల మధ్య నెలకొన్న వివాదంతో అక్టోబరు నెల రేషన్‌సరుకుల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. దీనిపై ఆంధ్రజ్యోతి"లో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం - 12వ తేదీ వచ్చినా లబ్దిదారులకు అందని రేషన్" శీర్షికన వార్త ప్రచురితమైంది, స్పందించిన రెవెన్యూ పీడీఎస్ ఉన్నతాధికారులు 12, 13తేదీల్లో సెలవు తీసుకోకుండా లబ్దిదారులకు రేషన్ పంపిణీచేయాలని డీటీ, వీఆర్వో. వీఆర్‌ఏలకు ఆదేశాలు జారీచేశారు. దీంతో శని, ఆదివారాల్లో పోర్టబులిటీ విధానం ద్వారా సుమారు 330 కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. రేషన్ పంపిణీలో వీఆర్వో ఎస్.రామారావు, వీఆర్యేలు బాబ్జీ, ఝాన్సీ పాల్గొన్నారు.

టీడీపీ నేత అప్పారావు మృతి పార్టీకి తీరనిలోటు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 13 : గ్రామంలో టీడీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా సేవలందిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన డోకల అప్పారావు మృతి తీరని లోటని అధ్యక్షుడు బేతా శేషుకుమార్ అన్నారు. ఆరుగొలను టీడీపీ సీనియర్ నాయకుడు డోకల అప్పారావు ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, తెలుగురైతు కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, రైతు సమాఖ్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఆదివారం నివాళులర్పించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.525

మోపిదేవిలో భక్తుల రద్దీ



మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పెద్ద సంఖ్య లో నాగపుట్టలో పాలుపోసి విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి వారికి ఆదివారం ఒక్క రోజులోనే రూ.7,99,971 ఆదాయం వివిధ సేవా టిక్కెట్ల ద్వారా లభించినట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.



కోనేరుసెంటర్‌లో భారీగా శక్తిపటాల ఊరేగింపు



శక్తిగుడి వద్ద కళాకారులతో మంత్రి కొల్లు రవీంద్ర

భారీగా శక్తిపటాల ఊరేగింపు

● శక్తిగుడిలో మంత్రి రవీంద్ర పూజలు ● పర్యవేక్షించిన ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 : దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అర్ధ రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కోనేరుసెంటర్‌లో పెద్ద ఎత్తును శక్తిపటాలు ఊరేగింపు జరిపారు. కోనేరు సెంటర్‌లో దాదాపు ఎనిమిది గంటల సేపు శక్తిపటాలతో నృత్యం చేశారు. డీజేలపై నిషేధం ఉన్నప్పటికీ వాటిని వినియోగిస్తూ శక్తిపటాలను ఊరేగింపుగా తీసుకు వచ్చారు.

ఈడేపల్లి శక్తిగుడి నుంచి శక్తిపటాలు ఎక్కువగా తరలి రావడంతో కోనేరుసెంటర్ కిటకిటలాడింది. ఈడేపల్లి శక్తి గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర అమ్మవారి సేవలో పాల్గొన్నారు. మంత్రికి శక్తిగుడి ఆలయ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. శక్తిగుడి వద్ద కళాకారులను మంత్రి అభినందించారు. శక్తిపటం తీసుకుని వెళ్లే కళాకారులతో కలిసి డప్పు వాయించారు. మహిళలు సైతం శక్తిపటం మోస్తూ ఊరేగింపులో పాల్గొనడం విశేషం. ఎస్పీ గంగాధరరావు కోనేరుసెంటరులో శక్తిపటాల విన్యాసాలను తిలకిస్తూ, శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

మళ్లీ ఘర్షణ.. ఒకరికి గాయాలు

శక్తిపటాల ఊరేగింపు సందర్భంగా బలరామునిపేటలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆర్‌పేట పోలీసుల కథనం ప్రకారం గతంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ పునరావృతం కావడంతో రాళ్లు రువ్వుకున్నారు. ఆర్‌పేట పోలీసులు గాయాలకు గురయిన శ్యామసుందర్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. సీఐ ఏసుబాబు దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బలగాలను తరలించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

కమ్యూనిస్టులే దేశానికి దిక్సూచి

● కంఠంనేని అచ్యుత రామయ్య వర్ధంతి సభలో గుజ్జుల ఈశ్వరయ్య

మోపిదేవి : రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులే దేశానికి దిక్సూచి అవుతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఆదర్శ కమ్యూనిస్టు, మోపిదేవి మాజీ సర్పంచ్ కంఠంనేని అచ్యుత రామయ్య 13వ వర్ధంతి ఆదివారం మోపిదేవిలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ అచ్యుత రామయ్య 17 సంవత్సరాలపాటు ఏకగ్రీవ సర్పంచ్‌గా మోపిదేవిలో పరిపాలన సాగించిన అభివృద్ధికి మారుపేరుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తికొండ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు,



మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీ రాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు మల్లుపెద్ది రత్నకుమారి, అచ్యుత రామయ్య ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంఠమనేని కుటుంబరావు, రావి ప్రభు ప్రసాద్, బండి రామకృష్ణ, కర్లపూడి ఆదిశేషు తదితరులు ఉన్నారు.



పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో శమీపూజ



మోపిదేవిలో శమీ వృక్ష పూజ నిర్వహిస్తున్న అర్చకులు



శమీపూజ చేస్తున్న భాస్కరరావు, గోపాలకృష్ణమూర్తి దంపతులు

వైభవంగా శమీపూజ.. దుర్గమ్మ గ్రామోత్సవం

మచిలీపట్నం టౌన్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి వివిధ ప్రధాన దేవాలయాల్లో శమీపూజ నిర్వహించారు. బందరుకోట రామాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు శమీ పూజలో పాల్గొన్నారు. గొడుగుపేట శివాలయంలో న్యాయవాది ఎ.వి.ఆర్‌రాజు దంపతులు శమీపూజ చేశారు. **గుడ్లవల్లేరు :** వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊంజలసేవ, పంచహారతులు, సెమీపూజ, పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఆదివారం 20 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకన్నారు. ఈవో ఆకుల కొండలరావు పర్యవేక్షించి, విజయదశమి వేడుకల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. **బంటుమిల్లి :** పాశ్చాపురం ఆంజనేయ స్వామి, బంటుమిల్లి సీతారామస్వామి , దుర్గమ్మ, పెదతుమ్మిడి ఆగస్త్యేశ్వరస్వామి, అర్తమూరు రామాలయంలో అమ్మవారి గ్రామోత్సవం, శమీపూజ వైభవంగా నిర్వహించారు. **పెడన రూరల్ :** ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేవేంద్రలో దసరా వేడుకల్లో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నసమారాధనలు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, అంకెం పమిడేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. పెడనలో పైడమ్మతల్లి, వాసవీ కన్యకాపరమేశ్వరి, శ్యామలాంబ ఆలయాల్లో దసరా ఉత్సవాలు జమ్మి సేవతో ముగిశాయి. **గుడివాడ రూరల్ :** చిన ఎరుకపాడు అష్టలక్ష్మీ ఆలయం, చౌటపల్లి, మల్లాయిపాలెం, మోటూరు, దొండపాడు తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. **పామర్రు:** శివాలయం, విష్ణాలయంలో ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చి జమ్మి చెట్టు సెంటర్లో శమీవృక్షానికి ఆలయ ప్రధాన అర్చకులు లంకా భీష్మ కుమార్ పూజలు జరిపారు. ఈవో వెంకట రెడ్డి పర్యవేక్షించారు. భేతనబోట్ల ఫణీంద్ర, పవన్‌శర్మ సహకరించారు. **తోట్లవల్లూరు :** దేవరపల్లిలోఅమ్మవారి ఊరేగింపు కనుల పండువగా జరిగింది. భద్రిరాజుపాలెంలో భక్తులకు అన్నసమారాధన జరిగింది. తోట్లవల్లూరు శివాలయంలో దసరా ఉత్సవాలు



కోడూరులో కనకదుర్గమ్మ తెప్పోత్సవం

నిర్వహించారు. **అవనిగడ్డ :** లక్ష్మీనారాయణ స్వామి శమీ పూజ వైభవంగా జరిగింది. ధర్మకర్తలు పోతరాజు భాస్కరరావు, గోపాలకృష్ణమూర్తి దంపతులు పూజలు జరిపారు. దీవి రఘు అధ్యక్షతన శమీ వృక్ష ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. అర్చక స్వాములు వేణుగోపాలాచార్యులు, అప్పలాచార్యులు, నరసింహమూర్తి, బాలకృష్ణామాచార్యులు తీర్థ ప్రసాదాలు అందించారు. లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి



చేవేంద్ర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాగిత

వ్రతాలు నిర్వహించారు. ఈవో వై.శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **మోపిదేవి :** మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి, పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వర స్వామి ఆలయాల్లో జమ్మి చెట్టు వద్ద అర్చకులు పూజలు జరిపారు. వెంకటాపురం, మోపిదేవి, పెదప్రోలు గ్రామాల్లో అమ్మవారి దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. **చల్లపల్లి :** కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ పెద్దలు, యువజన సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు. రామానగరం గంగానమ్మ ఆలయ ఉత్సవ పందిరిలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్ ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఆలయకమిటీ పెద్దలు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **కూచిపూడి :** గ్రామాల్లో చలువ పందిళ్లలో ప్రతిష్ఠించిన అమ్మవార్లను ఆదివారం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మొవ్వ, కూచిపూడి తదితర గ్రామాల్లో నిమజ్జన వేడుకలు జరుగగా, యువకులు, మహిళలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఆదివారం కూచిపూడి బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సంతోషిమాత దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష కుంకుమార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జ్యోస్యుల కార్తికేయ శర్మ పూజలు జరిపారు. **కోడూరు :** షిర్డిసాయి దివ్య ధ్యాన, జ్ఞాన మందిరంలో శనివారం బాబావారి మూల విరాట్‌కు గోక్షీరాభిషేకం నిర్వహించారు. భారీ అన్నసమారాధన చేశారు. చైర్మన్ రేపల్లె వెంకట నారాయణ పర్యవేక్షించగా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కనకదుర్గమ్మ దేవాలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయం పక్కనే ఉన్న చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. గంగానమ్మ ఆలయం వద్ద మురళీ కోలాటం ప్రదర్శించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్లు కోట యుగంధర్ రావు, కోట రాంబాబు పర్యవేక్షించారు. **నాగాయలంక :** గణపేశ్వరం దుర్గా గణపేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. వ్యవస్థాపక ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) అరుణ దంపతులు, ఈవో.సుధాకరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



గుడివాడ : గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా బి.శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ శ్రీనివాసరావుకు అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి పాల్గొన్నారు.

బాణసంచా నిల్వ చేసిన వ్యక్తిపై కేసు

పెడన రూరల్ : దక్షిణ తెలుగుపాలెంలో అక్రమంగా బాణాసంచా నిల్వచేసిన ఇంటిపై ఎస్సై సత్యన్నారాయణ ఆదివారం దాడి చేసి కేసు నమోదు చేశా రు. కోమట్ల బాలరాజు ఎటువంటి అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ ఉంచడంతో కేసు నమోదు చేశామన్నారు.

దాడిలో గాయాలు

పెడన రూరల్ : బొల్లా భాగ్యలక్ష్మి, తన కుమారునితో కలిసి కొంకేపూడినుంచి భైరాగిపాలెం తిరిగి వెళుతున్న సమయంలో బంటుమిల్లి రోడ్డు సెంటర్ వద్ద నాంచారయ్య, శివ , ప్రసన్న, వెంకటేశ్వరరావు దాడిచేశారు. తలకు తీవ్రమైన గాయాలు కావటంతో బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యన్నారాయణ తెలిపారు.



లక్ష్మీ లీలాకుమారికి ఎమ్మెల్యే కుమార్‌రాజా నివాళి

పెదపారుపూడి : మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి మేనత్త, టీడీపీ సీనియర్ నాయకురాలు అట్లూరి లక్ష్మీ లీలాకుమారి చిత్రపటానికి ఎమ్మెల్యే కుమార్‌రాజా నివాళులర్పించారు. మనిముక్కు రాంబాబు, దానబోయిన వెంకటనారాయణ, చిలక ఆంజనేయులు, కొల్లి రమణబాబు, మాయల విజయ బాబు, నాగదేసి కల్యాణ్‌రావు, దగాని జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తోట్లవల్లూరు : యాకమూరు వద్ద శనివారం అక్రమంగా తరలిస్తున్న 42 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఉయ్యూరుకు చెందిన కంతేటి నిరంజన్ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా యాకమూరు వద్ద పట్టుకున్నామని ఎస్సై అర్జునరాజు తెలిపారు. ఈ బియ్యం నూజివీడుకు చెందిన ఎస్ రాముకు తరలిస్తున్నట్టు తేలిందన్నారు. మైలవరం గంగారాజుకు చెందిన టాటా వాహనాన్ని బియ్యంతో సహా సీజ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కోడిపందేల శిబిరంపై దాడి

చాగంటిపాడు కృష్ణానది ఒడ్డున కోడిపందేల శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడిపంజులను, రూ 3,600 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై అర్జునరాజు తెలిపారు.

496 సీసీ రహదారుల నిర్మాణం

అవనిగడ్డ : పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు సందర్భంగా నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 48.730 కిలోమీటర్ల పొడవునా 496 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాల పేరుతో విస్తృత అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అవనిగడ్డ మండలంలో రూ.549.60 లక్షలతో మంజూరైన 9,061 మీటర్ల 104 సీసీ రోడ్లు, అదనంగా మంజూరైన రూ.76.20 లక్షలతో 1,270 మీటర్ల పొడవున 13 సీసీ రోడ్లు మొత్తం రూ.625.80 లక్షలతో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి

ఆముదార్లంకలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

చల్లపల్లి : వచ్చే దసరా నాటికి నియోజకవర్గంలో నూరు శాతం సీసీ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆముదార్లంకలో నూరుశాతం సీసీ రోడ్ల నిర్మాణానికి ఆది వారం ఆయన శంకుస్థాపన చేశారు. ఉపాధి నిధులు రూ.85.70 లక్షలతో 1500 మీటర్ల పొడవైన 17 సీసీ రోడ్లను గ్రామంలో నిర్మించనున్నారు. గ్రామంలో దాతలు మండవ రమాదేవి, మండవ ఝాన్సీలక్ష్మి, వేములపల్లి రాఘవేంద్రరావు పునర్నిర్మించిన వాటర్ ప్లాంటును బుద్ధప్రసాద్ ప్రారంభించారు. రావిచెట్టు సెంటరులో నూతనంగా అభివృద్ధి చేసిన రచ్చబండను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, సర్పంచ్‌లు నడకుదిటి ఆదిలక్ష్మి, పైడిపాముల కృష్ణకుమారి, వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, గ్రామపెద్ద వేములపల్లి రాఘవేంద్రరావు, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, టీడీపీ నేతలు మండవ బాలవర్ధిరావు, నాదెళ్ల నరసయ్య, నిడమానూరి దిలీప్‌కుమార్, ముమ్మనేని నాని, బుజ్జి, మండవ బాబు, ఈవో నాగలక్ష్మి తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రజలందరికీ అయ్యప్పస్వామి కృప : వర్ల

పామర్రు : అయ్యప్ప స్వామి కృప అందరిపై ఉండాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆకాంక్షించారు. చల్లపల్లి రోడ్డులో మెడికల్ షాపు యాజమాని అనిల్ అయప్ప దీక్షా పరులకు ఆదివారం ఏర్పాటు చేసిన సద్ది (అన్నసమారాధన) కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. మాగంటి నాని, తాడిశెట్టి సాంబశివరావు, సాయిబాబు గురుస్వాములు పాల్గొన్నారు.



అయ్యప్పల అన్నసమారాధనలో ఎమ్మెల్యే వర్ల

మంటాడ ఆలయంలో చండీహోమం

మంటాడ (పమిడిముక్కల) : మంటాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని జరిపిన హోమాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తిలకించి పూజలు చేశారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు రూ.2 లక్షల విరాళం

చల్లపల్లి : స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్ట్‌కు చల్లపల్లి ప్రముఖులు జాస్తి ప్రసాద్..లక్ష్మీ రాణి కుమారుడు హేమంత్..నిశ్చల దంపతులు రెండు లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆదివారం 3261వ రోజు స్వచ్ఛ కార్యక్రమంలో కార్యకర్తలతో కలిసి శ్రమదానం చేసి మొక్కలు నాటారు. విరాళాన్ని ట్రస్ట్ సభ్యులు నల్లూరి రామారావుకు అందించారు. స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



ట్రస్ట్ సభ్యులు ఎన్.రామారావుకు విరాళాన్ని అందిస్తున్న జాస్తి ప్రసాద్ కుటుంబ సభ్యులు



ఏజీకే పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుడివాడ : ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల 2005-06 పదవ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. నాడు విద్యనభ్యసించిన సహచరులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావును ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

సిద్ధేశ్వరాలయంలో ధ్వజ,శిఖర పునఃప్రతిష్ఠ నేడు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 8.02 గంటలకు ధ్వజ, శిఖర పునఃప్రతిష్ఠ, అనంతరం నూతన ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ జరుగుతుందని ఆలయ నిర్వాహకులు కొసరాజు వెంకటాద్రి (పెదబాబు) తెలిపారు. అనంతరం మహాపూర్ణాహుతి, అన్నసమారాధన జరుగుతాయన్నారు.

లయన్స్ ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ చికిత్సా శిబిరం నిర్వహించారు. డాక్టర్ గవిర్నేని రజని 102 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరానికి దాతలుగా డాక్టర్ నర్రా గంగాధరరావు (వెస్ట్ ఇండీస్), వల్లభనేని రామకృష్ణ (యుఎస్ఏ), కొసరాజు బాపయ్య చౌదరి వ్యవహరించారు. శిబిర కోఆర్డినేటర్ మూల్పూరి సుధాకర్, క్లబ్ అధ్యక్షురాలు శశికళ, కార్యదర్శి పెరుమాళ్ళు, పరంధామయ్య, రాజేశ్వరరావు, మురళీ, రామకృష్ణ, ఫణిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో మద్యం దుకాణాలకు 274 దరఖాస్తులు


కూచిపూడి : మొవ్వ ప్రొబిహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన 11 మద్యం దుకాణాలకు 274 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ బి.వరాల రాజు తెలిపారు. అప్లికేషన్‌కు రెండు లక్షల చొప్పున రూ.5.48 కోట్లు ఆదాయంగా లభించినట్లు తెలిపారు. మొవ్వ మండలానికి 35, 36, 37, 38 నెంబర్లు గల నాలుగు దుకాణాలు, చల్లపల్లి మండలానికి 39, 40, 41, 42 నెంబర్లు గల నాలుగు షాపులు, ఘంటసాల మండలానికి 44, 45, 46 నెంబర్లు గల మూడు షాపులు కేటాయించినట్లు సీఐ తెలిపారు.

బర్రంకులలో జనసేన పార్టీ దిమ్మె ప్రారంభం

నాగాయలంక : బర్రంకుల గ్రామంలో నూతనంగా నిర్మించిన జనసేన పార్టీ జెండా దిమ్మెను వెంకట్రామ్ ప్రారంభించారు. కూటమినేతలు తలశిల స్వర్ణలత, శేషుబాబు, గోపాళం వెంకటేశ్వరరావు, భోగాది సోమశేఖర్, తోట శ్రీనివాసరావు, వర్రే రాంబాబు, వెంకట ప్రసాద్, భోగాది శివవిష్ణువర్ధన్, బండ్రెడ్డి మల్లికార్జునరావు, బండ్రెడ్డి హరి, పిరాటి బలరామ్, పిరాటి శిరీష, తోట కొండలు, కమతం వెంకట నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు పూజలు చేశారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచారి నేతృత్వంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు, శివప్రసాద్, శేషు, బలరామ్, బాబురావు, వినయ్, గాంధీ, శివాజీ, యలవర్తి ఆది, భావన్నారాయణ, బుల్లబ్బాయ్, రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



స్వామి సేవలో మండలి, కొనకళ్ల